క్లుప్తంగా

జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్‌కు కేబీఆర్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి అంతర్ విశ్వ విద్యాలయాల రోప్ స్కిప్పింగ్ పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాలకు చెందిన ఎస్.సాగర్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల రోప్ స్కిప్పింగ్ పోటీలలో సాగర్ ప్రతిభ కనపరిచి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో సాగర్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. సాగర్‌ను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటశివ, పీడీ, అధ్యాపకులు అభినందించారు.

సొసైటీ భవనం ఆధునికీకరణ

బొల్లాపల్లి : మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ అభివృద్ధి పనులు చేపట్టారు. సొసైటీ కార్యాలయ అభివృద్ధికి నిధులు కేటాయింపు జరిగాయని, ఆక్రమణలకు గురైన కార్యాలయ స్థలాన్ని సర్వే చేయించి చుట్టూ ప్రహరీ, భవనాన్ని ఆధునికరణ పనులు చేపట్టినట్లు సొసైటీ చైర్మన్ డి.గోవిందునాయక్ తెలిపారు. చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించి స్థలాన్ని స్వాధీన పరచుకుని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా కేశానుపల్లి సుబ్బారావు, ప్రధానకార్యదర్శిగా రాయల శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. తమ నియామకానికి సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.లెనిన్, మోహన్, చిన్నమల్లయ్య, శ్యామ్, ఖాశీం, గోపి, శ్రీనివాసరావు, రామ్మోహన్‌రావు, చాంద్‌నాగేశ్వరరావు, అంజి, తులసిరెడ్డి, కేపీ, సీపీ పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వినుకొండ (నూజెండ్ల): గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణ శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈపూరు మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన గుంటూరు మహేష్ (17), వినుకొండకు చెందిన షేక్ బాజీలు ద్విచక్ర వాహనంపై నరసరావుపేట వైపు నుంచి వినుకొండకు వస్తుండగా వినుకొండ వైపు నుంచి నరసరావుపేట వెళుతున్న గుర్తు తెలియని లారీ విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో ఢీ కొట్టిందన్నారు. సంఘటనలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా, బాజీ తీవ్రగాయలతో చికిత్స నిమి త్తం వైద్యశాలకు తరలించడం జరిగిందన్నారు.

అమర్నాథ్ యాత్రకు సన్నాహం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అమర్నాథ్ యాత్ర నిర్వహిస్తున్నట్టు సొసైటీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ ప్రహ్లాదగుప్త బుధవారం తెలిపారు. యాత్ర జూన్ 25వతేదీన ప్రారంభమవుతుందని తెలిపారు. హిందువులలో జాగృతి, సంఘటితం కోసం తమ సొసైటీ పనిచేస్తున్నదనీ, దేశభక్తి, దైవభక్తిని పెంపొందించేందుకు ప్రతి ఏడాది అమర్నాథ్ యాత్ర నిర్వహిస్తున్నట్టు వివరించారు. యాత్రలో సహజంగా ఏర్పడిన అమర్నాథ్ మంచు శివలింగ దర్శనం, శక్తిపీఠం వైష్ణోదేవి ఆలయం దర్శనంతో పాటు పలు ఆలయాలు, ప్రదేశాల సందర్శన ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9989508525 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

హాకీ పోటీలకు జేఎన్‌టీయూఎన్ విద్యార్థిని



నరసరావుపేట రూరల్: జాతీయ సీనియర్ హాకీ పోటీలకు జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని అల్లాడి కోమాలిక ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ ఎడ్యూకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీపీ రాజు బుధవారం తెలిపారు. కళాశాలలో సీఎస్‌ఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న కోమాలిక ఈనెల 14వ తేదీ నుంచి మహారాష్ట్రలోని పూణేలో నిర్వహిస్తున్న 14వ అల్ ఇండియా సీనియర్ నేషనల్ హాకీ ఉమెన్ ఛాంపియన్ షిప్–2024లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. జాతీయ హాకీ పోటీలలో పాల్గొంటున్న కోమాలికను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిశోర్‌బాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీపీ రాజు, వివిధ విభాగాల అధిపతులు, అభినందించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

నాదెండ్ల: ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశ్వేత చెప్పారు. సాతులూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. గ్రామ పరిధిలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, సీజనల్ పండ్లు భాగం చేసుకుంటే అన్నిరకాల మినరల్స్, విటమిన్లు లభిస్తాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. రక్తహీనత నివారణ, మంచి ఆరోగ్యానికి చిరుధాన్యాలు అవసరమన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రతినెలా టేక్ హోం రేషన్, హాట్ ఫుడ్ ద్వారా పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.పద్మ, ఏఎస్‌ఎం రాజేశ్వరి, ఎంఎస్‌కే అఖిల, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

16 వేల జగనన్న ఇళ్లపట్టాల పంపిణీ

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- తొమ్మిదో వార్డులో రిజిస్ట్రేషన్ ఇళ్లపట్టాల పంపిణీ
- ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలంటూ మహిళలకు సూచన
- వలంటీరు వ్యవస్థ కావాలంటే మళ్లీ జగనన్న పాలనే రావాలి



ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



కార్యక్రమానికి హాజరైన మహిళలు

నరసరావుపేట: నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా 16 వేల మంది మహిళలకు జగనన్న కాలనీలలో ఇళ్లపట్టాలు అందజేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ఏనాడు ఒక్కరికీ ఇళ్లపట్టా అందజేసిన చరిత్ర లేదన్నారు. బుధవారం పట్టణంలోని తొమ్మిదో వార్డు శ్రీనివాసనగర్‌లో వార్డు మాజీ కౌన్సిలర్, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని మహిళలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వార్డు పరిధిలోని 279 మంది ఇళ్లపట్టాలు పంపిణీ చేశామని, వారిలో 221 మందికి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు అందజేస్తున్నామన్నారు. మిగిలిన వారికి ఎన్నికల కోడ్ వచ్చినా వారం రోజుల వ్యవధిలో అందజేస్తామన్నారు. ఇంకా రాని వారు మరో వందమంది ఉన్నారని, ములకలూరులో భూమి చూశామని, వారికి అందులో ఇళ్లపట్టాలు ఇస్తామన్నారు. పట్టణంలో ఎనిమిది వేలమందికి, రెండు మండలాల్లో ఎనిమిది వేలమందికి ఇచ్చామన్నారు. ప్రభు త్వం తరపున 157ఎకరాలు భూమి కొని పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. అమ్ముకునేందుకు అవకాశం ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని సీఎం జగన్ తలిస్తే చంద్రబాబు కోర్టులో అడ్డుకొని స్టే తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం పోరాడి ఆ స్టేను ఎత్తివేయించిందన్నారు. రిజిస్ట్రేషన్ పట్టాల వలన వాటిని బ్యాంకులో కుదువపెట్టి రుణం తీసుకోవచ్చన్నారు. పిల్లలకు, ఇతరులకు బదిలీ చేయవచ్చని, మరో పదేళ్ల తర్వాత విక్రయించుకోవచ్చన్నారు. ఒక్కో పట్టాకు రూ.8 వేల ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారన్నారు. వార్డులో 320 మందికి అమ్మఒడి మంజూరు చేశామని, వారికి ప్రతి ఒక్కరికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తున్నామన్నారు. అందులోని రూ.2 వేలు స్కూలులో మరుగుదొడ్లు, వాచ్‌మెన్‌ల కోసం తల్లితండ్రుల కమిటీకి ఇవ్వటం జరిగిందన్నారు. గిరి స్కూలును నాడు–నేడు కింద రూ.48 లక్షల వ్యయంతో ఆధునీకరించటం జరిగిందన్నారు. పథకాలన్ని మహిళల పేరుపై ఇస్తూ సాధికారిత ఏమిటో చూపించారన్నారు. ఇళ్లపట్టా పొందిన తెనాలికి చెందిన మహిళ గీతాంజలి టీడీపీ, జనసేనల అసభ్యకర ట్రోలింగ్‌కు బలైందని, ఆమెకు సీఎం జగన్ రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారన్నారు. వలంటీరు వ్యవస్థ కావాలంటే సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అరవిందబాబు అబద్ధాలు చెబుతూ తిరుగుతుంటాడని, తన స్వార్థం కోసం ఏదైనా చెబుతుంటాడన్నారు. తొలుత వార్డులో ఏర్పాటు చేసిన పార్టీజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది సింధుకూరి శ్రీనివాసరావు, గాలం కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, నాయకులు షేక్ కరిముల్లా, షేక్ రజాక్, త్రిపురారెడ్డి, సుభాని, సయ్యద్ ఫాతిమా, చాంద్‌బాష, సుబ్బా రెడ్డి, నాగార్జున, పఠాన్‌మస్తాన్‌వలి, ఈదర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇళ్లస్థల పత్రాలు పంపిణీ అభినందనీయం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



లబ్ధిదారులకు ఇంటి నివేశిత పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: నవరత్నాల్లో భాగంగా అర్హత కలిగిన ఉన్న పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయటం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని వేల్పూరు గ్రామంలో అర్హత కలిగిన పేదలందరికీ ఇంటి నివేశిత పట్టాలు రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం గ్రామంలోని కళామందిరం సెంటరు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హత కలిగి ఉన్న పేదలందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వేల్పూరు గ్రామ పంచాయతీలో నాలుగు లేఅవుట్స్ కేటాయించి 259 మంది లబ్ధిదారులకు నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రిజిస్ట్రేషను అయిన ఇంటి స్థలాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు మంజూరు చేశామన్నారు. అలాగే గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీర్నేడి రత్నగిరి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు తూమాటా కబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా కోటేశ్వరరావు, స్వర్ణాల వెంకటరావు, ముండ్రు రాఘవరావు, పెద్దన్న, ఆలపాటి సాంబశివరావు, గట్టుపల్లి వీరాస్వామి మహిళలు పాల్గొన్నారు.


ఒత్తిడి లేకుండా శ్రద్ధగా పరీక్ష రాయాలి



మండల కేంద్రం జెడ్పీహైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో -2, హెచ్‌ఎం

బొల్లాపల్లి: 10వ తరగతి విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో -2 కె.పార్వతి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో–2 మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూటికి నూరు శాతం మార్కులు సాధించాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే సమయంలో హడావుడి లేకుండా నిర్దేశించిన సమయానికే పరీక్షా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఒత్తిడికి గురి కాకుండా శ్రద్ధగా పరీక్ష రాయాలని, చదివిన అంశాలను గుర్తుంచుకొని సమాధాన పత్రంపై వివరించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, శరీరానికి తగినంత మంచినీరు అవసరమన్నారు. ఉపాధ్యాయులు బోధించే ముఖ్యమైన అంశాలను శ్రద్ధగా ఆలకించి పరీక్షా కేంద్రంలో దృష్టిపెట్టాలని సూచించారు. హిందీ సబ్జెక్ట్‌లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందజేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో వెల్లటూరు, గుమ్మనంపాడు, మేళ్లవాగు, బొల్లాపల్లి జడ్పీ హైస్కూల్స్, మండల కేంద్రంలో మోడల్ స్కూల్, కేజీబీవీలకు చెందిన 393మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు మండలం నుంచి హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం



పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్

రొంపిచర్ల: విద్య, వైద్యం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనడానికి సంతగుడిపాడు గ్రామమే నిదర్శనం అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సంతగుడిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంతగుడిపాడు గ్రామంలో రూ.54 కోట్ల రూపాయలతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అములు చేస్తున్నామన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ఒక్క హైస్కూల్‌నే రూ.3 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ గోపిరెడ్డికి ఒక ఓటు, తనకు ఒక ఓటు వేసి తమను గెలిపించి రాష్ట్రంలో తిరిగి జగన్ మోహన్‌రెడ్డికి అధికారం చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 379 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకట్రావు, సర్పంచ్ ఉయ్యాల సీతమ్మ, ఎంపీటీసీ తిరపాటి అంజనారెడ్డి, మాజీ సర్పంచ్ పల్లకి అంజనారెడ్డి, డాక్టర్ పల్లకి సురేష్ రెడ్డి, గాడిపర్తి సీతయ్య, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పడాల చక్రారెడ్డి, మోతుకూరి వెంకటేష్, కంచేటి రామారావు, కల్లం శివారెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, పునుగోటి నాసరరావు, పునుగోటి వెంకట్రావు, పోతులూరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నరసరావుపేట: కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని వ్యాపారస్తులు, అధికారులకు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి సూచించారు. బుధవారం లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్, ఫిష్ మార్కెట్, బాబాపేట నాగసరపు సుబ్బరాయ గుప్తా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, 34వ వార్డులోని బరంపేట, స్టేడియం పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా శానిటేషన్ సిబ్బంది, వ్యాపారస్తులతో మాట్లాడుతూ మార్కెట్ పరిసర ప్రాంతాలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్‌కు పట్టణ ప్రజలు ఉదయాన్నే వస్తారు కనుక అక్కడ వచ్చేచెత్త ఉదయాన్నే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తమ షాప్ చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. ప్రతి షాప్ వద్ద 20 లీటర్ల ప్లాస్టిక్ డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకొని వచ్చే వేస్టను క్రింద పడేయకుండా అందులో వేసినట్లయితే ప్రజలు షాపులు వద్దకు వచ్చి కొనుగోలు చేయడానికి ఇష్టపడతారన్నారు. వ్యాపారస్తులు తమకు కేటాయించిన షాపులలోనే ఆ స్థలాలలోనే వ్యాపారం చేసుకోవాలని సూచించారు. బరంపేటలో వార్డు ప్రజలతో మాట్లాడుతూ ప్రతిరోజు మా పురపాలక సిబ్బంది చెత్త తీసుకెళ్లేందుకు, కాలువలు శుభ్రం చేసేందుకు వస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. వీటిపై ఎలాంటి సమస్యలు ఉన్న వార్డులో ప్రతిరోజు తిరిగే సానిటేషన్ సెక్రటరీ తెలియజేయడం ద్వారా వాటిని త్వరగా క్లియర్ చేయడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ పైపులైను కనెక్షన్స్ విషయమై ఆరాతీశారు.

సోలార్ ఫ్యానల్స్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: ప్రధానమంత్రి ఘర్ యోజన పథకంలో భాగంగా సోలార్ ఫ్యానల్ రూఫ్ టాప్ విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు అర్హత కలిగిన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి కోరారు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషను సందర్శించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సాజన్యంతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 150 యూనిట్స్ లోపు 01 కిలోవాట్‌కు రాయితీ నగదు రూ.30 వేలు, 02 కిలోవాట్‌కు రూ. 60 వేలు రాయితీ వర్తిస్తుందన్నారు. 150 నుంచి 300 యూనిట్స్ విద్యుత్ వినియోగదారులు మూడు కిలోవాట్ వరకు రూ.78 వేలు రాయితీ ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. మూడు కిలోవాట్స్ పైబడిన వారందరికీ ఇదే రాయితీ వర్తించుతుందన్నారు. ఈపథకానికి సంబంధించి దరఖాస్తు చేసుకునే వారందరూ ఆరు నెలల వరకు విద్యుత్ బిల్లులు జత పరచాలన్నారు. ఒక కిలోవాట్ రూఫ్ టాప్ ఫ్యానల్ నెలకు దాదాపుగా 125 యూనిట్లు ఉత్పత్తి చేస్తుందన్నారు. సోలార్ రూఫ్ టాఫ్ ఫ్యానెల్లు సూర్యుని వేడిని పీల్చుకోవటం వల్ల ఇళ్ళు చల్లగా ఉంటాయన్నారు. సోలాప్ రూఫ్ టాప్ ఫ్యానల్స్ చుట్టూ చల్లనిగాలి ఉంటుందన్నారు. వినియోగదారుడు 5 నుంచి 6 సంవత్సరాలోపు తమ మూలధన వ్యయాన్ని పొందుతారన్నారు. మరిన్ని వివరాలు కొరకు సెల్‌నంబర్లు 9440817544, 9493174288, 9701785231 సంప్రదించాలన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో గల తూర్పు బజారులో వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ 5వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఆలయ పూజారి పేటేటి కృష్ణ శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారిని, శ్రీ కాలభైరవ స్వామి వారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన, అలంకరణ పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు, మహిళలు అధికసంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రివేళల్లో ఆలయ ఆవరణలో భజన కార్యక్రమములు నిర్వహించారు.

తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలి

నరసరావుపేట: నలభై ఏళ్లు దాటిన వారందరూ తరచుగా కంటి పరీక్షలు చేయించుకొని కంటి చూపు కాపాడుకోవాలని ప్రభుత్వ కంటి వైద్యులు డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. బుధవారం ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ నీటి కాసుల వ్యాధుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా నీటి కాసుల అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. నీటికాసులు వ్యాధి వలన కంటి నరం దెబ్బతిని చూపు తిరిగి రాదన్నారు. అందువలన తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెడికల్ సూపరింటెండెంట్ ఎం. మంత్రు నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ దయానిధి, డాక్టర్లు ఏడుకొండలు, హేమశ్రీ, రామకృష్ణ, మురళి పాల్గొన్నారు.

పారాహుషార్



నరసరావుపేటలో బుధవారం అదనపు బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిష్టియన్ పాలెం, కోటసెంటర్, బరంపేట తదితర ప్రాంతాల్లో సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం అదనపు బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. టూటౌన్ పరిధిలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సతీష్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.
–నరసరావుపేట టౌన్

అందరూ మెచ్చిన 'జగనన్న పాలన'

- ప్రజల హృదయాల్లో నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, ప్రజారంజకపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే బొల్లా ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, సైడ్ డ్రెయినేజీకి సంబంధించి శిలాఫలకాలు ఆయన ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామపరిపాలన వ్యవస్థ నూతన ఒరవడి తెచ్చారని, ఈ పాలనలో ప్రజలకు ఆరోగ్యవంతంగా హెల్త్ క్లినిక్‌లు, రైతులకు అన్ని సౌకర్యాలు, హంగులతో రైతు భరోసా కేంద్రాలు, పరిపాలనలో సచివాలయాలు తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందజేయడంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలు కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని తెలిపారు. నేరుగా పథకాలు లబ్ధిదారుల చెంతకే చేరుతున్నాయన్నారు.

గతంలో ఏంచేశారో ఆలోచించుకోండి

గత ప్రభుత్వాల హయాంలో ప్రజలకు ఏం చేశారో టీడీపీ ఆలోచించుకోవాలన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు, నీరు–చెట్టు తదితర కమిటీల పేరుతో ప్రజలను నిలువుదోపిడీ చేశారని విమర్శించారు. దుర్మార్గపు ఆలోచనలతో అబద్ధాలు, మోసపూరితమైన వాగ్దానాలతో టీడీపీ అధికారంలోకి రావడానికి కుయుక్తులు పన్నుతోందని, ప్రజలు గుర్తుంచుకొని తిప్పికొడతారన్నారు.
పెత్తందారులు, రౌడీయిజం వంటి ప్రణాళికలతో రాబోయే ఎన్నికల్లో టీడీపీ చేసే దుర్మార్గాలను ప్రజలు ఎదుర్కొంటారన్నారు. బాబు గారిడీ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రూ.2.40 లక్షల కోట్లతో ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద రైతులను ఆదుకోవడమే..

వినుకొండ(నూజెండ్ల): నిరుపేద రైతులను ఆదుకోవడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బొల్లాపల్లి మండలంలోని అయ్యన్నపాలెం, మేకలదిన్నె, బోడిపాలెం తండాలకు చెందిన 250మంది రైతులకు 500 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలను ఎమ్మెల్యే బొల్లా అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిపై ఎలాంటి హక్కు పత్రాలు లేక ఇప్పటివరకు అనేక ఇబ్బందులు పడ్డామని, కాని ఇప్పుడు శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో మాకు హక్కు పత్రాలను పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని, మేము ఎల్లప్పుడు ఎమ్మెల్యే బొల్లాకు రుణపడి ఉంటామని ఆయా గ్రామాల ప్రజలు ఈ సందర్భంగా తెలిపారు.
అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ బొల్లాపల్లి మండలంలో అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేసి నిరుపేద రైతులను ఆదుకున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. రైతులకు తగిన న్యాయం చేయాలని చట్టసభల్లో మాట్లాడి, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సన్న,చిన్నకారు రైతులకు హక్కు పత్రాలను పంపిణీ చేయాలనే ధృడ సంకల్పంతో పనిచేసి నేడు పట్టాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బొగ్గరం ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



స్వామివారి దేవాలయం

ఈపూరు: మండలంలోని బొగ్గరం గ్రామంలో వేంచేసియున్న కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పిలువబడే ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు నేడు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినం అనంతరం వచ్చే పాల్గుణ శుద్ధ పంచమి నాడు ఈతిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. స్వామివారిని దర్శించుకొని కోర్కెలు కోరుకుంటే కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢా విశ్వాసం. ఈదేవాలయం ప్రాంగణంలో సంతానవేణుగోపాల స్వామి దేవాలయం ఉంది.ఈస్వామి చుట్టూ ప్రదక్షణలు చేస్తే సంతానం కల్గుతాయని నమ్మకం. గ్రామస్తులే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాల వారు కూడాఈ తిరునాళ్ళకు హాజరై పొంగుళ్ళు నిర్వహిస్తారు. బొగ్గరంతోపాటు, కొండాయపాలెం,చిట్టాపురం,ఇర్లపాడు, పోట్లూరునుండి భక్తులు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు.నియోజకవర్గంలో ప్రసిద్ధి కాంచిన తిరునాళ్ళ కావటం చేత భక్తులు తమ మొక్కుబడులకు తీర్చుకునేందుకు ఐదు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. తిరునాళ్ళ వేడుకలకు దేవాలయాన్ని గ్రామస్తులు ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే దుకాణాల వారు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తిరునాళ్లలో ఏటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు నరసరావుపేట డీఎస్పీ పర్యవేక్షణలో వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ సారథ్యంలో స్థానిక ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారన్నారు. తిరునాళ్ల జరిగే ప్రాంతాన్ని సందర్శించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పార్కింగ్ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.


చందవరంలో పాఠశాల గదుల ప్రారంభోత్సవం



పాఠశాల అభివృద్ధికి సహకరించిన పలువురిని సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

నాదెండ్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు ఫేజ్–2 నిధులతో పాఠశాలలకు అన్ని మౌలిక వసతులు కల్పించటం జరిగిందని ఎంఈవో–2 ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. చందవరం గ్రామ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలకు నాడు–నేడు ఫేజ్–2లో భాగంగా అదనపు గదులు నిర్మించి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల మౌలిక సదుపాయాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నదన్నారు. ఈ పథకం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారి మౌలిక సదుపాయాలు సమకూరాయన్నారు. ఇంగ్లిష్ మీడియం, పోషకాలతో కూడిన జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, విద్యా కిట్ తదితరాలతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుండటంతో వారి జీవితం ఉజ్వలం కానుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో–1 శ్రీలక్ష్మీ, రిటైర్డ్ ఎంఈవో ఆంజనేయులు, సర్పంచ్ షేక్ మస్తాన్‌వలి, హెచ్‌ఎం వీరయ్యాచౌదరి, గొంటు శ్రీనివాసరెడ్డి, ప్రభాకరరెడ్డి ఉన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



మాట్లాడుతున్న గోవిందరాజులు

వినుకొండ టౌన్: మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం, ఎంతో అభినందించదగ్గ విషయమని నియోజకవర్గ శాలివాహన సంఘం అధ్యక్షులు గొట్టం గోవిందరాజులు పేర్కొన్నారు. పట్టణంలోని శాలివాహన నగర్ నందు కుమ్మర కల్యాణ మండపంలో గోవిందరాజులు ఆధ్వర్యంలో జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రామాయణాన్ని తెలుగులో సరళీకృతంగా అనువదించిన మహిళా కవయిత్రి మొల్లమాంబ అన్నారు. కార్యక్రమంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు పారెళ్ల రమేష్, పట్టణ అధ్యక్షులు బొంకూరి రోశయ్య, మద్దికుంట ఆదినారాయణ, చిరంపల్లి రామయ్య, లింగయ్య, రామాంజనేయులు, సుబ్రమణ్యం, లక్ష్మయ్య, దాసయ్య, నాగేశ్వరరావు, నరసింహారావు తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.